

# అమెరి "కమర్షియల్" కామెడి
## వంగూరి చిట్టెన్‌రాజు



## "కొత్త తంటా" -కొత్తేమిటంటా?

1

**శివరాం గాడు ఇందాకా పిలిచాడు.** అంటే ఏమిటో విశేషమే అనుకుంటూ వాడినే అడిగాను.

"ఒరేయ్ ఇప్పుడే టీవీ నైన్ చూశాను. అందులో నీ మొహం వెనకాల ఎక్కడో కనపడింది"

"ఓ అదా?"

"అదే, ఆ మొహమే, ఆ చొక్కాయే. కాకుల్లో హంసవో, హంసల్లో కాకివో తెలియ లేదు, కానీ మళ్ళీ ఈ కొత్త తంటా ఏమిటంటా?"

"ఏమిటంటానూ? అదే అంటాను. అమెరికాలో కొత్త తెలుగు సంఘం వెలిసింది అంటాను"

"అదేం కొత్తంటావా? లేక ..అంటే శ్రీశ్రీ గారి బాపతా?"

"అదేమిటీ? మధ్యలో ఆయనేం చేశాడంటా? "

"అదేరా, 'మీసాలకి రంగేదో వేసేస్తే ముసలాడు యువకుడవుతాడా? సీసాకి లేబుల్ మార్చేస్తే బ్రాందీ విస్కీ అగునా?' ఆ టైపేనా? "

"ఏమో తెలియదు కానీ, నేను కొత్త తంటా అంటాను."

"కొత్త తంటా అంటే, పాత తంటా ఒకటి ఉందంటావా?"

"అదే మరి, ఒకటేమిటీ? మూడు ఉన్నాయి కదా!"

"మరి, ఇది నాలుగోదంటావా?"

"అదే కదా నేనంటా?"

"నాలుగెందుకంటా? అమెరికాలో అంత కొంప మునిగిందంటావా?"

"కొంప మునగా లేదూ. మరొక దీపం వెలగా లేదంటా, కానీ తెలుగు జనం పెరిగారంటా."

"అయితే ఈ కొత్త తంటా కొత్త తెలుగోళ్ళనుంచి వచ్చిందంటావా?"

"లేదే! పాత వాళ్ళనుంచే అంటా. ఆ ఆట మానేసి కొత్త ఆట మొదలెట్టారంట."

"అంటే? "

"అదే, ఐదు ఇంగ్లీషు పదాలని అటూ, ఇటూ తిప్పేస్తే కొత్త తంటా సంఘం పుట్టుకొచ్చేస్తుంది అమెరికాలో. "

"అవేమిటిటా? "

"అవే, TANTAS అంటా. అమెరికాలో అన్ని సంఘాలకీ మూలం ఆ తంటాసే అంటా. "

"ఇది మటుకు కొత్తంటావా? నువ్వే కదా ఇది వరకు అలాంటి చచ్చు రాతలు రాసింది. "

"అదే మరి. ఇది వరకేమో TANA, ATA, NATS, ఇప్పుడేమో NATA. రాబోయేదేమో.. "

"రాబోయేదా? అదేంటీ? "

"అదే ఇక అ అక్షరాలతో లాటరీ తీస్తే వచ్చే సంఘమే STANTA అంటా. "

"అదేదో అట్లాంటా నుంచి వస్తుందంటావా? "

"అక్కడ నుంచి ఎందుకూ?"

"మరి అక్కడ చిరంజీవి అభిమానులు ఎక్కువ ఉన్నారంట కదా! పైగా స్టంటులు కూడా వేస్తాడుగా. "

"అక్కడే డౌటంట కదా! ఇక్కడ అమెరికాలో ఈ చిరంజివి ఏమిటంటా? "

"అదే కదా నేనంటూ ఉంట. ఆంధ్రాలో ఉన్న పార్టీలన్నింటికి ఇక్కడో తంటా సంఘం. వాటిల్లో చీలికలుంటే ఇక్కడో చీలిక సంఘమూ ఇక్కడా ఉంటుందంటా. "

"ఇంతకీ నువ్వు ఆ టీవీ నైన్ లో ఎందుకున్నావుటా? కొంపతీసి నువ్వు కూడా అలాంటి వాడివేనంటా? "

"అంత సీను లేదు కానీ, అప్పుడూ, ఇప్పుడూ ఆటలో అరటి పండునే! "

"క్వీన్ విక్టోరియా అనుకోకుండా రంగ ప్రవేశం. అనుకుని రంగ ప్రవేశం చేస్తే ఆవిడకీ, ఇతరులకీ తేడా ఏంటిటా? "

"అదేమిటీ, ఎవరూ, శివరాంతోనేనా నీ మంతనాలు.? "

"అవుననుకో, కొంప తీసి ఈ పైన రాసుకున్నవన్నీ చదివేశావన్న మాట."

"అన్న మాట ఏమిటీ ఉన్నమాటే అంటా. నువ్వు అసలు అన్నమాట నిలబెట్టుకున్నది ఎప్పుడూ? "

"ఇప్పుడేమయిందీ?"

"ఏమయిందంటావా? ఈ నెల నుంచీ కమర్షియల్ కామెడీ రాస్తానని అంటివిగా? ఇప్పుడు రాసిపారేసిన దాంట్లో కమర్షియల్ ఏముందిటా? "

"ఎందుకు లేదుటా. ఈ అమెరికా తెలుగు సంఘాలన్నీ కమర్షియల్ వాళ్ళేగా పెట్టేది. ఎక్కడయినా ఒక పండితుడో, కవి గారో, దేశవ్యాప్తంగా తెలుగు సంఘం పెట్టగలిగారా అంట?"

"అదా, నీ మంటా? సంఘం పెట్టడానికి డబ్బుండొద్దంటావా? "

"డబ్బుండాలనే కదా, కమర్షియల్ అంటుంటా! "

"ఈ తంటా సంఘాలలో వీటిల్లో ఏదన్నా లాభం ఉందంటావా? "

"నిన్నే చెప్పమంటా. ఎక్కడో అక్కడ కమర్షియల్ వాటాలో, రాజకీయ పలుకుబడో లేందే ఇదంతా ఎందుకుటా? "

"అసలు కందకు లేని దురద నీకెందుకుటా? నువ్వెందుకు ఇందులో దూరావుటా? "

"మరి లేక పోతే, టీవీ నైన్ వాళ్ళు కథలు రాసుకునే వాళ్ళని చూపిస్తారుటా? వాళ్ళ పక్కన నుంచుంటే, భుజాలు రాసుకుంటూంటే, మనమూ టీవీలో పడతామంటా? అవునంటావా? "

"ఏరా వెధవా? నేనిక్కడ ఫోన్ పట్టుకుని కూచుంట ఎందుకంటా, ఇంకెవరితోటో మాట్లాడుకోడానికంటా? "

"లేదు రా శుంఠా. మా ఆవిడే రేపు ఇండియా వెళ్తుందిటా, అదే మాట్లాడుకుంటుంన్నాం అనమాట."

"నీ మొహం అంటా. నువ్వు అబద్ధాలాడుతున్నావంటా. "

"శివరాం గారూ, ఎలా ఉన్నారూ? "

"బాగానే ఉన్నాను, పక్కింటి పిన్ని గారూ. "

"అసలు మా ఆయన్ని రెచ్చగొట్టడం ఎందుకంటా? ఇలా అవాకులూ రాయించడం కోసమే నంటా? "

"అమ్మ, అమ్మ, నెన్న్..ఉత్తిత్తినే....వాడు రాసుకుంటున్నట్టు నాకు తెలియదంటా... "

ఠపీమని ఫోన్ పెట్టేసిన చప్పుడు అవతలి వేపూ. ల్యాపు టాపు కిందపడిన చప్పుడు ఇటువేపూ. కొత్త సంఘం డప్పులు అన్ని వేపులూ.

***

Click here to share your comments on this article